క్లుప్తంగా

మాసశివరాత్రి పూజలు



ఆత్మకూర్: మాస శివరాత్రి సందర్భంగా బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో పూజారి కరుణాకరయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీభవాని మహిళా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. ప్రతి నెల మాసశివరాత్రి సందర్భంగా బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, ఈశ్వరమ్మ, తిరుపతమ్మ ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం వద్దు



పెబ్బేరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఎంపీపీ కిచ్చారెడ్డి అన్నారు. బుధవారం ఆయన వనపర్తి మండలంలోని కిష్టగిరిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం పంపిణీలో ఎలాంటి అవకతవకలు లేకుండా అర్హులందరికీ పంపిణీ చేయాలన్నారు. కేంద్రం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని వారికి సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

ఆత్మకూర్: ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక గాంధీచౌక్‌లో ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అలాగే వాహనదారుల హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, తాగి డ్రైవింగ్ చేయరాదని సూచించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



ఆత్మకూర్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వివేకానంద సేవాసమితి, నేత్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం విశ్వభారతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 260 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, 50 మంది విద్యార్థులకు కంటి చూపు లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మాస్టర్ బాలు, రాజేష్, నేత్రం ఫౌండేషన్ నిర్వాహకులు రమేష్, పుష్పగిరి, మణికంఠ, పాఠశాల కరస్పాండెంట్ బాలరాజు, ప్రిన్సిపాల్ చంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ వేగవంతం



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలులో భాగంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం దరఖాస్తుల కంప్యూటీకరణ వేగవంతంగా కొనసాగుతుందని తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజు అన్నారు. ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని పది వార్డుల్లో మొత్తం 5,507 దరఖాస్తులు, మండలంలోని 13 పంచాయతీల్లో 9,158 దరకాస్తులు మొత్తం 14,665 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తుల్లో పొందుపరిచిన అంశాలన్నింటినీ ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా పొందుపరుస్తున్నామని, మీసేవ నిర్వాహకుల సహరిస్తున్నారని పేర్కొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఇంగ్లిష్ మీడియం కేజీబీవీలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. సర్పంచు వెంకటరమణ బుధవారం పాఠశాలకు వెళ్లి పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన మెటీరియల్‌ను ప్రత్యేక అధికారి లలిత సమక్షంలో అందజేశారు.

పేకాటరాయళ్ల అరెస్టు

పెబ్బేరు రూరల్: పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు పట్టుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. వనపర్తి రూరల్ ఎస్‌ఐ నాగన్న కథనం ప్రకారం.. వనపర్తి మండలంలోని రాజనగరం శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పోలీసులకు సమా చారం రావడంతో స్థావరంపై దాడి చేశారు. పేకాటరాయళ్లలో ఐదుగురు పారిపోగా.. ఐదుగురు దొరికారు. వారి నుంచి రూ.3,480 నగదు, 7 సెల్‌ఫోన్లు, 3 బైకులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్

- సాధారణ పోలింగ్ మాదిరిగానే నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



ఓటేయడానికి క్యూ లైన్‌లో నిలబడ్డ విద్యార్థినులు



మాక్ పోలింగ్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయిలు

కొత్తకోట రూరల్: మండలంలోని వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పోటీల్లో పాల్గొనే ఐదుగురు విద్యార్థులతో నామినేషన్ వేయించారు. కలెక్టర్‌గా పవిత్ర, పీఏగా శ్రావణి, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా సానియా, ప్రొసీడింగ్ అధికారిగా స్వాతి, పోలింగ్ ఆఫీసర్‌గా జ్యోతి, రంజానా, జునేద్, మహేష్, ఎన్నికల ఏజెంట్లుగా శైలజ, శంకర్, మాలిక్, చరణ్ ఎన్నికల బాధ్యతలు నిర్వహించారు. పోలీసులుగా విజయ్, నందిని విధులు నిర్వర్తించారు. ఈ పోటీలో 10వ తరగతి విద్యార్థులు బి.రాజేశ్వరి (బల్బు గుర్తు) సి.రవి (షటిల్ బ్యాట్), కె.మౌనిక (గోడ గడియారం), టి.భారతి (పెన్సిల్), ఎస్.సాత్విక్‌కుమార్ (కంప్యూటర్) పాల్గొనగా వారికి ఎన్నికల గుర్తులను కేటాయించారు. 43ఓట్లతో స్కూల్ లీడర్‌గా ఎస్.సాత్విక్‌కుమార్ ఎన్నిక కాగా, 41ఓట్లతో ఎస్.మౌనిక సెకండ్ లీడర్‌గా ఎన్నికైంది. ఎన్నికల్లో గెలుపొందిన సాత్విక్‌కుమార్‌కు బహుమతి ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.సురేష్‌కుమార్, ఉపాధ్యాయ బృందం వెంకట్‌నారాయణ, శేఖరాచారి, శ్రీనివాసులు, మునీరుద్దీన్, మహేష్, బాలరాజు, వెంకటలక్ష్మి, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఆనందంగా ఉంది



పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహిస్తుంటే నిజంగా ఎన్నికల్లో నిలబడి గెలిచినంత ఆనందంగా ఉంది. ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలి, నామినేషన్, ఓట్లు ఎలా వేయాలి అనే అంశాలపై పూర్తి అవగాహన వచ్చింది. ఓటు వేస్తుంటే చాలా సంతోషం అనిపించింది.

– ఎస్ సాత్విక్ కుమార్, పదో తరగతి, వెల్టూర్

ఎన్నికలపై అవగాహన కోసం..



భారత రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రయోగాత్మకంగా విద్యార్థులచే మాక్ పోలింగ్ నిర్వహించాం. ఎన్నికలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్‌పై ఉపయోగపడుతుంది. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. విద్యార్థులు నిజంగా ఓటర్ల మాదిరిగా క్యూలైన్‌లో నిలబడి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

– పి.సురేష్‌కుమార్, హెచ్‌ఎం, వెల్టూర్ జెడ్పీహెచ్‌ఎస్

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు..



విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై అవగాహన వచ్చేందుకు విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించి, వారిచే నామినేషన్ వేయించాం. నామినేషన్ ఎలా వేయాలి, గెలుపొందిన వారు ఏఏ బాధ్యతుల చేపట్టాలి అని తెలిసేలా చేశాం. ఎన్నికలో పాల్గొన్న ప్రతి విద్యార్థి ఉత్సాహంగా బరిలో నిలబడి తమకు ఓటు వేయమని తోటి విద్యార్థులను అడిగారు. ప్రతి విద్యార్థి ఎన్నికలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉంటే ఉత్తమ పౌరుడిగా మెలుగుతాడు.

– శ్రీనివాసులు, సాంఘిక ఉపాధ్యాయుడు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



మాట్లాడుతున్న జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు ఇంటి వద్ద చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ వారికి తోడ్పాటునందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు సమయాన్ని వృథా చేయకుండా శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా చదువుతూ పరీక్షలపై ఏలాంటి భయం లేకుండా రాసేలా విద్యార్థులను తయారు చేయాలన్నారు. సబ్జెక్టుల వారీగా ఆయా ఉపాధ్యాయులు సిలబస్‌ను పూర్తి చేసి విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేయాలన్నారు.

ఇంటింటి సర్వే

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, పిల్లలను పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి అన్నారు. బడిఈడు పిల్లల ఇంటింటి సర్వేలో భాగంగా బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో బడి మానేసి ఇంటి పనులు చేస్తున్న విద్యార్థుల వివరాలను తెలుసుకొని వారి ఇళ్లకు వెళ్లి చదువు ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ సంతోష్, కేశవులు పాల్గొన్నారు.

విద్యార్థులు, ఉపాధ్యాయుల సంక్షేమమే ప్రధానం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: విద్యార్థుల, ఉపాధ్యాయుల సంక్షేమమే సంఘం ప్రధాన ఆశయమని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సూగూరు వరప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీరంగ నాయకస్వామి ఆలయంలో మండల పీఆర్టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వరప్రసాద్‌తో పాటు ఎంపీపీ వినీలారాణి, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ హాజరై పీఆర్టీయూ టీఎస్ నాయకులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు, డీఏలు సత్వరమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టేందుకు కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాయత్రి, విండో చైర్మన్ జగన్నాథంనాయుడు, రామచంద్రయ్య, నాగేశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శివశంకర్‌యాదవ్, బాలసుబ్రమణ్యం, అధ్యక్షుడు చిన్న రాములు, దయానంద్, నరేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా రాణించండి



ఆత్మకూర్: వ్యాపారస్తులు ముద్ర యోజన పథకంలో రుణాలు పొంది ఆర్థికంగా రాణించాలని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ మహ్మద్ అబ్బాస్‌అలీ, ఫీల్డ్‌ఆఫీసర్ మదన్‌మోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ కార్యాలయం ఆవరణలో ముద్ర లోన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. రుణాలు కావలసిన వారు ముద్ర రుణ దరఖాస్తు పత్రం, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పత్రం, వ్యాపార అనుమతి లేదా నమోదు పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, వార్షిక ఆదాయ పన్ను రిటర్న్ పత్రాలను తీసుకురావాలని సూచించారు.

మూఢనమ్మకాలను దూరం చేయడమే లక్ష్యం

అమరచింత: సమాజంలో మానవుడిని అజ్ఞాతంలోకి నెట్టివేస్తున్న మూఢనమ్మకాలను దూరం చేయడమే నాస్తిక సమాజ ముఖ్య ఉద్దేశ్యమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ అన్నారు. పట్టణంలో బుధవారం నాస్తిక సమాజం నూతన క్యాలెండర్‌ను వామపక్ష పార్టీల నాయకులతో కలిసి సంఘం జిల్లా అధ్యక్షుడు జాకబ్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మనిషి మూఢనమ్మకాలు, దేవుడు అనే భావనను వదిలి వేయాలని సూచించారు. భౌతికంగా మనిషి దేవుడిపై ఆధారపడడం సరికాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ప్రజాపంథా మండల కార్యదర్శి రాజన్న, సీపీఐ నాయకులు మోష, అబ్రహం, సీపీఎం నాయకలు రాజు, శ్యాంసుందర్, కుతుబ్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి వాలీబాల్ పోటీలు

వీపనగండ్ల: సంక్రాంతి పండగ సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 12వ తేదీ నుంచి సంగినేనిపల్లిలో ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ ఇంద్రకంటి వెంకటేష్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతిగా రూ.10వేలు, 2వ బహుమతిగా రూ.5,016 అందజేస్తామని తెలిపారు. ఈ పోటీలో అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని జయప్రదం చేయాలని క్రీడల ఆర్గనైజర్లు శేఖర్, మోహన్ నాయుడు తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయండి

అమరచింత: పట్టణంలోని సర్వే నంబర్ 10/2లోని 34, 35 లో గల రెండు ఎకరాల పొలంలో అక్రమంగా ప్లాట్లను ఏర్పాటు చేసి అమ్ముకుంటున్నారని, వాటి రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని సబ్‌రిజిస్ట్రార్‌కు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా ఫిర్యాదు చేశారు. డీటీసీపీ అనుమతులు లేకుండానే అక్రమంగా డాక్యుమెంట్లు సృష్టించి నాలా పర్మిషన్ ఉన్న వెంచర్‌లో ప్లాట్‌లను విక్రయిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. వీటిపై సమగ్రంగా విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కబ్జాను అరికట్టండి

ఖిల్లాఘనపురం: వీరన్న గుట్టపై అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన డబ్బాను పూర్తి స్థాయిలో తొలిగించి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని గ్రామానికి చెందిన యువకులు రమేష్ తదితరులు బుధవారం తహసీల్దార్ పాండునాయక్‌ను కోరారు. ఈ విషయమై గతంలో గ్రామానికి చెందిన యువకులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన తహసీల్దార్ డబ్బాను పాక్షికంగా తొలిగించారు. పూర్తి స్థాయిలో తొలిగించాలని బుధవారం యువకులు కార్యాలయం ఎదుట ప్లకార్డులు పట్టుకుని నిరసన చేశారు. బీజేపీ నాయకులు రాంరెడ్డి, బుచ్చిబాబుగౌడు అక్కడికి చేరుకుని వారికి మద్దతుగా పలికారు. తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన డబ్బా విషయంలో ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ వారికి చెప్పారు. త్వరలోనే పూర్తి స్థాయిలో తొలిగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు యువకులు, బీజేపి నాయకులు పాల్గొన్నారు.



కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ప్రసాద్, రాజు, హన్మంతు అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లో ఐఎఫ్‌టీయూ, గ్రామపంచాయతీ వర్కర్ల యూనియన్ జిల్లా రెండో మహాసభను నిర్వహించారు. రాష్ట్రంలో సుమారు 50వేలకు పైగా కార్మికులు పంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారని, వారందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కార్మికులు అన్నివిధాలుగా నష్టపోయారని, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని నియమించారు. కార్యక్రమంలో కుర్మన్న, రమేష్, నాగన్న, మోజేష్, కార్మికులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కవిత

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి మాత ఆలయంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత ముఖ్య అతిథిగా హాజరై ముగ్గుల పోటీలను తిలకించడంతో పాటు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పండుగలను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని, ఈ ఏడాదంతా నియోజవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, పీఏసీఎస్ డైరెక్టర్ గుంత సురేష్, ఆర్యవైశ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: మండలంలోని కస్తూర్బాగాంధీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన 37 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ లీగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, మండల నాయకులు రమేష్ తదితర నాయకులు అభినందించారు. పాఠశాల ప్రత్యేకాధికారి లలితతో పాటుగా విద్యార్థులను కలిసి మాట్లాడారు. ఈ నెల 20వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొనను న్నారు. కార్యక్రమంలో పీఈటీ చిట్టి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఝాన్సీ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైందని కరాటే మాస్టర్ వరుణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20, 21న హైదారాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో మ్యూజికల్ ఫామ్, పాయింట్ ఫైట్ విభాగాల్లో విద్యార్థిని పోటీ పడనునట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ భానుప్రకాష్, హెచ్‌ఎం గణేష్‌కుమార్, పీఈటీ శేఖర్, కరాటే మాస్టర్ వరుణ్, సీనియర్ విద్యార్థులు ప్రవీణ్, హరిప్రసాద్‌తో కలిసి బుధవారం పాఠశాలలో ఝాన్సీని సన్మానించారు.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయండి

అమరచింత: మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుఊత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ చాంద్‌పాషాకు బుధవారం వినతిపత్రం అందించారు. ఆత్మకూర్ మండలంలో మున్సిపాలిటీతో పాటు మూడు ఆధార్ కేంద్రాలు ఉన్నాయని, అమరచింతలో మాత్రం ఒక్క ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడం ఏమిటని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ ప్రశ్నించారు. అమరచింత మండల కేంద్రంతో పాటు మున్సిపాలిటీ కేంద్రంగా ఏర్పాటు చేసినా ఆధార్ కేంద్రం లేకపోవడంతో సమీపంలోని ఆత్మకూర్, సీసీకుంట, జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితులు దాపరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు రఘు, విష్ణు, సాగర్, ఆనందం, యుగంధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వీపనగండ్ల: ఇటీవల మండల కేంద్రానికి చెందిన విద్యార్థి వర్ష శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతూ ఆత్మహత్య చేసుకుంది. బుధవారం కొల్లాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యాన్ని చెప్పారు. అలాగే మండల కేంద్రానికి చెందిన రవీందర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురికాగా అతడి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీరయ్యయాదవ్, మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బీచుపల్లి యాదవ్, నక్క విష్ణు, బస్వరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్పందించి రూ.5వేల ఆర్థికసాయం పంపించారు. సర్పంచ్ సత్యంయాదవ్, మండల అధ్యక్షుడు వనం రాములు, రాజశేఖర్ బుధవారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, నగదును అందజేశారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి రోగాల బారిన పడకుండా కాపాడాలని పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవులు అన్నారు. బుధవారం మండలంలోని రేమద్దులలో నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీకాలకు వచ్చిన ప్రతిసారి మాతా శిశు సంరక్షణ కార్డు తప్పక తీసుకరావాలని, పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తల్లులకు సూచించారు. వైద్యుల సూచనలను పాటిస్తూ, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్ల నివేదికల పరిశీలన

వీపనగండ్ల: ఉమ్మడి మండలంలోని ప్రాథమిక ఉప కేంద్రాలలో మందుల పంపిణీ, రికార్డుల నమోదు అంశాలను బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి వంశీకృష్ణ పరిశీలించారు. యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లోని సబ్‌సెంటర్ల ద్వారా గ్రామాల్లోని ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, అందుకు వినియోగించిన మందులపై పూర్తి స్థాయిలో పరిశీలన చేసినట్లు వైద్యాధికారి తెలిపారు.

ఈసారైనా చర్చకు వచ్చేనా?

- నేడు పాన్‌గల్ మండల సర్వసభ్య సమావేశం
- ఏళ్లుగా తిష్ట వేసిన సమస్యలు
- పరిష్కారానికి చొరవ చూపని అధికారులు, పాలకులు



పెండింగ్ బిల్లుల మంజూరు కోసం నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు (ఫైల్)

పాన్‌గల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నారు. మూడు నెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశంలో సమస్యలు సభ దృష్టికి వచ్చి వాటి పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటారని మండల ప్రజలు ఆశిస్తున్నా.. దానికి అనుగుణంగా సమావేశాలు జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ సమావేశంలోనైనా సమస్యల పరిష్కారానికి సభ్యులు చొరవ చూపుతారని మండల ప్రజలు కోరుకుంటున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నా అవి అమలుకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నట్లు మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమావేశానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరైతే కొన్ని సమస్యలైనా పరిష్కారం అవుతాయని సభ్యులు అభిప్రాయపడుతున్నారు.

మండలంలో సమస్యలు కొన్ని..

- మండల కేంద్రంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. కోతులను నివారిస్తామని గతంలో ఇచ్చిన హామీలు నీటి మాటలే అయ్యాయి.
- మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం, స్టాక్‌పాయింట్ గోదాంలకు సొంత భవనాలు కరువు.
- మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయానికి డైనింగ్ హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరై ఏళ్ల గడుస్తున్నా.. పనులు ముందుకు సాగట్లేదు.
- మండలంలోని మాధరావుపల్లి, శాగాపూర్, పాన్‌గల్‌లో కొంత ఆయకట్టు, దావాత్‌ఖాన్‌పల్లి, ఆకునోనిపల్లె, ఆకునోని పల్లెతండాకు సాగునీరు అందించే ఎంజే–6 మైనర్ కాల్వ అసంపూర్తిగా మిగిలి పిచ్చి మొక్కలు మొలవడంతో ఆయా గ్రామాలకు అందని సాగునీరు.
- మండలంలోని రేమద్దుల, అన్నారంతండా, దావాజిపల్లి, శాగాపూర్, మాధరావుపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి గ్రామాల్లో సాగునీటి కాల్వల తవ్వకంలో భూములు కోల్పోయిన పలువురు రైతులు పరిహారం కోసం ఏళ్లుగా ఎదురు చూపులు.
- మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లి, ఆకునోనిపల్లె, మంగళ్లపల్లి, గోప్లాపూర్, కిష్టాపూర్, దావాజిపల్లి, దొండాయిపల్లి గ్రామాలకు బీటీ రోడ్డు ఉన్న కానరానీ ఆర్టీసీ బస్సు.
- పలు గ్రామాల్లో సరైన డ్రెయినేజీలు లేక రోడ్లపై మురుగు పారుతోంది.
- మండలంలోని మల్లాయిపల్లి, చిక్కేపల్లి, మాందాపూర్ గ్రామాల్లో ఎస్సీలు, బీసీలకు ఇంటి నిర్మాణం కోసం స్థలాలు ఉన్నా హద్దులు చూపకపోవడంతో ఆయా వర్గాలు ఇబ్బందులు పడుతున్నారు.
- మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు.
- కేతేపల్లిలో ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణకు నోచుకోలేదు.
- చాలా పంచాయతీల్లో సర్పంచులు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసినా అందని బిల్లులు.
- పలు గ్రామాల్లో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం స్థలాలు ఎంపిక చేసిన నిర్మాణాలు చేపట్టలేదు. మరి కొన్ని గ్రామాల్లో స్థలాలు ఎంపిక కాలేదు.